# తీరిన కోరికలో తీరని వేదన

* రచయిత్రి; శ్రీమతి పోతుకూచి కనకదుర్గ *

విద్యుద్దీపాలతో!...పచ్చని తోరణాలతో, పెళ్ళిపందిరి కళకళలాడుతోంది. పురోహితుల మంత్రోచ్చారణ జరుగుతోంది, మంగళవాయిద్యాలు మార్మోగుతున్నాయి. రకరకాలచీరలు ధరించిన అమ్మాయిలు, పట్టుచీరలు ధరించిన ముత్తయిదువులు, కలగా పులగంగా కబుర్లలో పడ్డారు. (తమకి ఇక్కడ తప్ప ఇంక ఎక్కడా తీరుబడి లేనట్లు)

'కన్నెపిల్లలు' నలుగురు. పసుపు, కుంకమ, గంధం, పూలు, ఇస్తున్నారు వచ్చినవారికి...తమదే పెత్తన మన్నట్లు;...

మంగళవాయిద్యాలు సన్నగా మ్రోగుతున్నాయి. పురోహితుల కంఠాలు హెచ్చాయి. 'కన్యావరణాలు' చల్లిస్తున్నాయి.

ముత్తయిదువులంతా కబుర్లుమాని శ్రద్ధగావింటున్నారు. తదనంతరం,'జీలకఱ్ఱ బెల్లం' వధూవరుల నెత్తిన ఉంచారు ముహూర్తం సమీపించిందని, ..ఆ తరువాత 'సరోజ మెడలో తాళి కట్టాడు రాజారావు'...ఆటు తరువాత.. తలంబ్రాలు,...శాస్త్రోక్తంగా వివాహపు తంతు ముగిసింది, పెళ్ళికివచ్చిన పెద్దలంతా వధూవరులపై అక్షతలు జల్లి, తమతమ నివాసాలకు వెళ్ళిపోయారు.

రాజారావు తండ్రి రాఘవయ్య పక్షవాతంవల్ల కొద్ది దూరంలో, ఈజీచెయిర్‌లో పడుకుని పెళ్ళి తంతుచూస్తున్నాడు. తల్లి జగదాంబ కూడా భర్త...కుర్చీ ప్రక్కనే చాపమీద కూర్చుంది. మౌనంగా ..వివాహానంతరం, నమస్కారం చేసే నిమిత్త...వచ్చారు వధూవరులు .. తల్లి తండ్రులు, కొడుకుని, కోడల్ని మనసారా దీవిస్తూ అక్షతలు ఉంచారు.

నూతన వధూవరులు చెయ్యీ చెయ్యీ వదలకుండా పట్టుకుని 'గృహప్రవేశం' చేస్తున్నారు. ఆడపడుచు శ్యామల అడ్డు నిలచింది దారికి...పేర్లు చెప్పందేలోపల అడుగుపెట్టడానికి వీల్లేదని, ......'చెప్పండేర్రా ఎంత సేపు నిలబడతారు!' రేపటినించీ పేర్లు పెట్టే పిలుచుకుంటారు. ఇప్పుడు చెప్పడానికి అంత బిడియం ఎందుకు? అంది పెళ్ళికొడుకు పినతల్లి...ఎవరు ముందు చెప్తారా అని చూస్తున్నారు, చుట్టూ మూగిన ముత్తయిదువులంతా;...

ఏమనుకున్నాడో! రాజారావు...'సరోజ, నేను వచ్చాము దారి వదలండి!' అన్నాడు!

సరోజమాత్రం...రావుగారూ నేనూ వచ్చాము దారి యివ్వండి.' అంది. అన్నగా ..అందరూ ఫక్కున నవ్వేరు.

'అబ్బో! మా అన్నయ్యపేరు అప్పుడే కట్ చేసిందే మానదిన' అన్నాడు మరిది హాస్యంగా;...

ఈ మాట వినగానే సరోజ మరింత సిగ్గుపడింది. సిగ్గుల మొగ్గ అయిన సరోజను, చూచి రాజారావు తన్మయుడయ్యాడు.

ఇది పసిగట్టిన శ్యామల,...'ఇక్కడ మేముంతా ఉన్నాం అన్నయ్యా'అంటూ గుర్తుచేసింది.

'పోవే! నీ చూపులు ఎప్పుడూ నామీదనే ఉంటాయా? అన్నాడు' రాజారావు ఆమెను గుర్రుగా చూస్తూ...

నవ్వులతో, ఛలోక్తులతో...ఆ యింటవాలు పెట్టింది సరోజ...'ముందు కుడికాలు పెట్టమ్మా' అంది అత్తగారైన జగదాంబ!...

ఆ తరువాత శ్యామల నాలుగురోజులు ఉండి అత్తవారింటికి వెళ్ళిపోయింది. శ్యామల గలగలా మాట్లాడుతూ ఉంటే చాలా సర్దాగా ఉండేది సరోజకు. తనాయింటికి కోడలు అవ్వడం తల్చుకుంటే ఆశ్చర్య మనిపిస్తూ ఉంటూ ఉంటుంది. రాజారావు విశాల హృదయానికి మనసులోనే జోహారు అర్పించింది.

* * * *

రాజారావు తండ్రి రాఘవయ్యకు ముగ్గురు సంతానం, ప్రథమసంతానం రాజారావు, తరువాత శ్యామల, పెద్ద సంబంధం తమ అంతస్థుదే చూసి వివాహం చేసినాడు. ఆ తరువాతవాడు శేఖరం బి. యి. మూడవ సంవత్సరం చదువుతున్నాడు.

రాఘవయ్యకు బట్టల దుకాణం పెద్దది ఉంది. దానితోనే ఆయన మంచి స్థితిపరుడు అయ్యాడు. ఆయన ఆరోగ్యం కుంటుపడగానే దాని బాధ్యత బి. ఎ. ప్యాసయిన రాజారావుకే అప్పగించాడు. వేరే ఉద్యోగాలవల్ల వచ్చే లాభం ఏమీలేదని...తండ్రిమాటను జవదాటలేక,...తరతరాలుగా తమయింట ఉన్న ఆ వ్యాపారాన్ని స్వీకరించాడు! రాజారావు చేపట్టిన తరువాతనుంచి దయి వ్యాపారం దినాదినాభివృద్ధి పొందసాగింది!

రాఘవయ్య హయాంనుంచీ తమ బట్టల దుకాణంలో గుమాస్తా శివానందం కూతురే...సరోజ, శివానందం

అంటే రాఘవయ్యకు మంచి 'నమ్మకస్తుడు' అని అభిమానం ఉండేది. ఆ తరువాత రాజారావు అంత అభిమానం చూపించేవాడు. శివానందానికి, ఆరుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. ఇద్దరు కూతుళ్ళకు ఎలాగో పెళ్ళిళ్లుచేశాడు. మూడవకుమార్తె సరోజను రాజారావు వివాహం చేసుకున్నాడు.

సరోజ పెద్ద అందగత్తె కాకపోయినా అనాకారి మాత్రంకాదు. పెద్ద చదువులు లేకపోయినా...ఆమెలో పెద్దలయందు వినయవిధేయతలు సుగుణ సంపద చూచి కట్నం, కానుకలు, ఆశించక ఆమెను చేపట్టాడు. ఈ విషయంలో తల్లితండ్రులు కూడా తమ సంతోషం వెలిబుచ్చారు. ఇంక రాజారావు ఆనందానికి అవధులు లేకపోయాయి.

సరోజ అత్తవారింటికి వచ్చిన దగ్గరనుంచీ ఇంట్లో అందరికీ తలలో నాలుకలా ఉండేది. అందరి అవసరాలు వేళ కనిపెట్టి తీరుస్తూ ఉండేది.

'ఎందుకు నీకు శ్రమ సరూ......ఇంట్లో పనివాళ్ళు ఉన్నారుగా'? అనేవాడు రాజారావు.

'ఎంత పనివాళ్లు చేసినా స్వయంగా చేసుకుంటే నాకు తృప్తిగా ఉంటుంది' అనేది సరోజ......చిన్నగా నవ్వి......

ఇంట్లో వంటమనిషి, కాంతమ్మకూడా వంట చెయ్యడంలో సహా...సహాయాలు చేస్తూఉండేది. కాంతమ్మ చాలా సంబరపడి 'నువ్వు చాలా అమాయకురాలివమ్మా, నీలాంటి మంచివాళ్ళు నూటికి ఒక్కరయినా ఉంటారా తల్లీ' అనేది.

'మీరు ఎక్కువగా పొగిడేస్తున్నారు కాంతమ్మగారూ నేనూ మామూలు మనిషినే' నవ్వేసేది సరోజ'.

మొదట్లో జగదాంబకి కోడలు అంటే నిరసన భావం ఉండేది. పేద సంసారాలో పిల్లనీ, కట్నం కానుకలూ లేవనీ... తమ ముచ్చట్లు ఏమీ తీరలేదని... గునుస్తూవుండేది.

'అన్నీ తెలిసి నము తెచ్చుకున్నాము సరోజను. ఎందుకమ్మా అంత తేలిక భావము' అనేవాడు రాజారావు బాధగా.

రానురాను కోడలి మంచితనము బోధపడి అభిమానం చూపించేది.

రాఘవయ్యగారు తీరిక సమయాలలో కోడలిచేత రామాయణము, భారతము, లాంటి గ్రంథాలు చదివించుకొని ఆనందించేవారు, జగదాంబకూడా శ్రోత అయి వినేది.

'అత్తమామల సేవలో పడి, భర్తను మరచిపోయేటట్లున్నావు సరూ'...అనేవాడు రాజారావు హాస్యంగా.

'ఎంతమాటన్నారు అందరూ నాకు ముఖ్యమయినవాళ్ళే! మీ హృదయంలో అర్ధాంగిగా భాగమిచ్చిన మిమ్మల్ని మర్చిపోవడమా?' అంటూ చాపిన అతని చేతులలో ఇమిడిపోయేది.

అలా అనురాగమయమయిన వారి దాంపత్యం ఆరు సంవత్సరాలు నిరాటంకంగా సాగిపోయాయి.

ఈమధ్యకాలంలో శేఖరం వివాహం జరగడం జూనియర్ ఇంజనీరుగా వేరే ఊళ్ళో ఉద్యోగం రావడం... భార్యను తీసుకుని వెళ్ళిపోవడం అన్నీ సినిమా రీలులా జరిగిపోయాయి.

'ఏ మార్పు లేనిది తన జీవితమే! అనుకునేది సరోజ!' తన భర్త రెండుచేతులా ఎంత సంపాదించినా తనకు ఇంకా పిల్లలు కలుగలేదన్న లోటు కొట్టవచ్చినట్లు కనబడేది.

జగదాంబకూడా తనకుతొందరలో మనమణ్ణి ఎత్తుకునే యోగం ఉందో లేదో! అని వాపోతూ ఉండేది. తనకు తెలిసిన మటుకు నోములు, వ్రతాలు చేయించింది కోడలిచేత......రాజారావు___

'నాకు దేముడు, దెయ్యాలు నమ్మకంలేదమ్మా పిల్లలు గీతలో ఉంటే పుడ్తారు లేకపోతే లేదు' అన్నా వినిపించుకోకుండా...యాత్రలుచేసి రమ్మని పంపింది.

సరోజ మొక్కని దేముడు వినలేదు. ప్రతిశనివారం కటిక ఉపవాసం చేసేది. ఏ దేముడు కరుణించలేదు. మరి రెండు సంవత్సరాలు గడిచాయి.

సరోజ చేసేవన్నీ పిచ్చిపనులని...... అప్పుడే నీకు వయసు మించిపోయిందా సరూ...ఏమిటిదంతా? విసుక్కునేవాడు రాజారావు.

'ఇలా ఉంటూండగా ఒక అనుకోని సంఘటనకు గురిఅయింది సరోజ.' వారియింటి ఎదురుగా ఉన్న ఇంజనీరుగారి భార్యకు కొడుకు పుట్టాడు. తొట్లోపెట్టే పేరంటానికి పిలిచారు. జగదాంబ తనకు ఓపికలేదు రాలేనని సరోజను వెళ్ళమంది. సరే! ఇక గత్యంతరంలేక! తను ఒక్కర్తె వెళ్లింది సరోజ.

సరోజను చూడగానే యింజనీరుగారిభార్య గబగబా బాబుని తెచ్చి సరోజ వళ్ళో పడుకోబెట్టింది.

సరోజ ఆనందంగా: పసివాడికాళ్ళూ, చేతులూ రాస్తూ తన్మయత్వంలో మునిగిపోయింది. స్వతహాగా పిల్లలంటే సరోజకు చాలా ముద్దుగా ఉండేది.

(తరువాయి 28 పేజిలో)

చంద్రయ్యను దిగు దిగు అంటూ దించారు. 'తాత గారు మా సైకిలు గుర్తుంది చూశారూ దానికే వేయండి మీ ఓటు' అంటూ బొజ్జ నవరించుకున్నాడు ఒక ఆసామి. అతన్ని నెట్టుకుంటూ ఒక నేరో ఫేంట్ కుర్రాడు 'తాత గారు ఇదిగో పక్షి గుర్తుకే మీఓటు వేయండి' అన్నాడు. 'తాతగారు ఈ రాట్నం గుర్తుకే మీ పవిత్రమైన ఓటు వేయండి' ఖద్దరు చీర, జాకెట్టు వేసుకున్న ఒక మహిళ అభ్యర్థన. వీరందరిని దాటుకుంటూ ముందుకు వెళ్ళాడు. ఒకళ్ళు చేయి పట్టుకున్నారు. మరొకరు దారిచూపారు. ఇంకవరో ఎండగావుందని గొడుగు పట్టుకున్నారుపాపం. ఎవరికి వారు మనకే ఓటు వస్తుందని తృప్తిగా వెళ్ళి పోయారు!

* * * *

చంద్రయ్య ఓటు వేసి మెల్లిగా బయటకు వచ్చాడు తృప్తిగా! ఏదో కోరిక తీరిందన్న సంతోషం, జ్వరం తాలూకు నీరసం. చంద్రయ్యని ఉక్కిరి బిక్కిరిచేశాయి. ఎలక్షన్ అయిపోయాక ఫలితాలకోసం ఎదురుచూసు న్నారు అందరూ! చంద్రయ్య ముసలాడితో వాళ్ళ కింక అవసర మేముంది, చంద్రయ్య మెల్లిగా పోలింగ్ బూత్ దాటి, రోడ్డు దాటిపోతున్నాడు. జ్వరంవల్ల వచ్చిన నీర సంతో రోడ్డు మధ్యలో పడ్డాడు. రయ్యన లారీదూసుకు పోయింది. చంద్రయ్య కాళ్లు చేతులువిరిగి ఎడ మెడంగా పడిపోయాయి—డ్రైవరు, రోడ్డు మధ్య నడిచే ముస లాయనదే తప్పని తనదారిన పోయాడు. లారీ వస్తుందో లేదో చూసుకుని నడవద్దు సాగతీశాడు సైకిలు గుర్తుకే ఓటువేయమన్న పెద్దమనిషి. 'అంత నడవలేని ముసిలాడు ఓటువేయటానికి రాకపోతేనేం. ఈఒక్క ఓటుతోనే అభ్యర్థులకు మెజారిటీ వస్తుందా' రాట్నం గుర్తుకే ఓటు వేయమన్న మహిళ సణుగు! 'పోలేపోనీయ్ లేదూ జనభా సంఖ్య తగ్గుతుంది' పక్షి గుర్తుకి ఓటు వేయమన్న నేరో పాంట్ కుర్రాడి మాటలు. చంద్రయ్యకు ఇక్కడ కొన వూపిరి కొట్టుకుంటుంది. ఆఖరి శ్వాస విడిచే ముందు వీరందరి వంక ఒక్కసారి చూశాయి చంద్రయ్య కళ్లు. వీళ్ళ మాటలకు చంద్రయ్యకు, ఈ ప్రపంచం మీద అస హ్యమేసింది. కొన్ని నిమిషాలలో ఎంత వ్యత్యాసం.

ఓటు వేయటానికి చెయ్యిపట్టుకున్నవాళ్లు గొడుగు పట్టినవాళ్ళు దారిచూపినవాళ్ళు తేనెల్లాంటిమాటలుచెప్పిన వాళ్ళు ఒకళ్ళైనా 'అయ్యో' అనలేదు. అవసరం తీరిపో యిందిగా.........ఇంకతను వాళ్ళ కేమీ ఉపయోగ పడడు.

ప్రతి మనిషి తన స్వార్థానికి ఉపయోగించుకుంటాడు. చంద్రయ్యకు వీళ్లందరిమీద అసహ్యం, ప్రపంచం మీదే విరక్తి వేసింది. 'ఈ లోకంలో అంతా స్వార్థపరులు రా, మరో ప్రపంచానికి రా' అంటూ ఆహ్వానించింది మృత్యు దేవత. ఈస్వార్థ ప్రపంచం, కుళ్లు ప్రపంచం నుండి పైకి పైపైకి ఎగిరిపోయింది చంద్రయ్య ఆత్మ!

---

(6వ పేజీ తరువాయి)

ఇంతలో ఇంజనీరుగారి అత్తగారు వచ్చి బాబుని అమాంతం సరోజ వడిలోంచి తీసుకుపోయిందిచోళ్ళా మార్చాలన్న నెపంతో.

ఇంజనీరుగారి భార్యకు పరిస్థితి అర్థంకాక, తల్లితో పాటు తనూ వెళ్ళింది లోపలకు...సరోజ ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది!

కూతుర్ని చూడగానే తల్లి 'ఓరి వెర్రి మొగమా' నీకేమైనా మతిపోయిందా? ఆ గొడ్రాలిచేతికి పిల్లని ఇచ్చావు! ఇంకేమయినా ఉందా! ఉండు దిష్టి తీస్తాను అంటోంది ఆమె ఎంత నెమ్మదిగా అన్నా ఆ మాటలు సరోజ చెవిలో పడ్డాయి. తాంబూలం తీసు కుని ఎలాగో యిల్లు చేరింది. 'గొడ్రాలు' అన్నపదం చెవుల్లో గింగురుమంటోంది. భరించలేనిబాధ...అపుకో లేని ఆవేదన...అయ్యింది. 'హృదయానికి సూటిగా తగిలిన ఆ మాట'...దిండులో తలదూర్చి వెక్కి వెక్కి ఏడ్చింది. సరోజ......

రాజారావు! వస్తూనే కంగారు పడ్డాడు. 'ఏమిటి సరూ! ఏమి జరిగింది.' అంటూ వాచిన ఆమె కళ్లను చూస్తూ...అతన్ని బల్లి కరచుకున్నట్లు మరింత కరచుకు పోయి బావురుమందిక్కి సరోజ.

ఆమెని ఎలా ఓదార్చాలో అర్థం కాని పరిస్థితిలో అలాగే ఉండిపోయాడు రాజారావు.

కొంచెము నిదానించిన తరువాత జరిగిన సంగతి క్లుప్తంగా చెప్పింది సరోజ... అంతా విన్న రాజా రావు. 'సరూ,...నీకు నిజంగా మతిపోయింది. ఎవరో ఏదో అన్నారని బాధపడడం అవివేకం......అలాంటి వారు అనే మాటలు పట్టించుకోకూడదు.' అన్నాడు అనునయంగా;...ఆ రాత్రి సరోజా కలత నిద్రపోయింది.

ఆ మరునాడు ఒక వార్త మోసుకొచ్చింది కాంతమ్మ. 'ఎవరో ఆ ఊరికి ఒక యోగిని వచ్చిందట. ఆమె అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్తుందిట. ఆమె హస్తవాసి కూడా మంచిదిట. ఆవిడ చేతితో తీర్థము తీసుకున్న వారికి తమ కోర్కెలు, సిద్ధిస్తాయట. ఇవి నాకు తెలిసిన వివరాలు', అని ముగించింది.

ఈ విషయం విన్న జగదాంబ, సరోజా, ఇద్దరూ ఆనం దించారు.నాలుగురోజుల అనంతరం ఒకరోజుఉదయాన్ని

కొబ్బరికాయ, పళ్లు, తీసుకొని సరోజను వెంటబెట్టుకుని ఆయోగిని బసచేసిన నివాసానికి వెళ్ళింది జగదాంబ...

వీళ్ళు వెళ్ళేసరికి ఆ యోగిని కాషాయ వస్త్రములు ధరించి ధ్యాన సమాధిలో ఉంది. దాదాపు గంటతరువాత భక్తులకు దర్శనమిచ్చింది: ఒక్కొక్కరికే ఎంతో శాంతంగా జవాబు లిస్తోంది. ఆమెమాటలు మంత్రముగ్ధులయి వింటున్నారు ఆమెను చూడవచ్చిన భక్తులంతా.. ఆ తరువాత జగదాంబ...తనకు తోచిన ప్రశ్నలు అడిగింది. చాలా శాంతంగా జవాబులు చెప్పింది యోగిని... ఆ తరువాత సరోజకు ఒక 'తాయిత్తు' యిచ్చి కట్టుకోమంది తీర్థము యిచ్చింది. మీ కోర్కె త్వరలో సిద్ధిస్తుంది అని దీవించి పంపింది. ఆమెకు మరల నమస్కారంచేసి తిరిగి వచ్చేసారు జగదాంబ సరోజ.

'యింటికి వచ్చిన జగదాంబ చాలా సంతోషంగా ఈ వార్త కొడుకు చెవిని వేసింది'

రాజారావు నవ్వి...భలే దానివమ్మా...మంత్రాలకు చింతకాయలు రాల్తాయా? అంటూ వేళాకోళంచేశాడు.

ఈమాటకు సరోజ చిన్నబుచ్చుకుంది.

జగదాంబ మాత్రం, ..ఓరే! రాజా! నువ్వు తేలిగ్గా తీసిపారెయ్యడం నాకేం నచ్చలేదురా! ఏపుట్టలో ఏముందో ఎవరు చెప్పగలరు. మనశాయశక్తులా మన ప్రయత్నం మనం చేయాలి'

ఆ తరువాత భగవంతుని దయ ఉండనే ఉంది. అంది'

'సరేలే! అమ్మా! మీ యిష్టాలకు, మీ నమ్మకాలకు అడ్డు ఎప్పుడూ రాలేదుగా! ఏం సరూ!' అంటూ భారంగా అడుగులేస్తూ అక్కడనుండి కదిలాడు దీర్ఘాలోచనలో పడి...ఇది గ్రహించిన సరోజ...అతని వెంటనే తను కూడా వెళ్ళింది.

యోగిని దర్శనమైన కొద్దిరోజులకు ఆవిడ తాయిత్తు మహిమవల్లనయితే నేమి! భగవంతుని కృపవల్లనైతే నేమి సరోజకు నెలతప్పింది. ఇంట్లో అందరి ఆనందానికి అవధులు లేకపోయాయి.

ఆమె కాలుకింద పెడితే అరిగిపోతుందేమో నన్నంతగా చూస్తున్నారు. తన కోర్కె తీరుతున్నందుకు తను గొడ్రాలిని కానని తనలో తను మురిసిపోసాగింది, సరోజ. ఆ యింజనీరుగారి అత్తగారి గర్వం అణచాలి, అప్పుడుగాని నేను నిశ్చింతగా నిద్రపోను అనుకునేది.

అయిదవ నెల రాగానే 'సీమంతం' చాలా ఘనంగా జరిపించింది జగదాంబ. అందరూ సరోజను పండులాంటి కొడుకుని కనమని దీవిస్తూ...బరువైన కవర్లని తీసుకొని వెళ్ళిపోయారు.

సరోజ మొదట్లో సంబరపడినా...నెలలు నిండుతున్న కొద్దీ...భయభ్రాంతులు ఎక్కువయ్యాయి. ఇది విన్న రాజారావు. 'వెర్రి ఆలోచనలు మానెయ్యి సుమా... మనసుని ప్రశాంతంగా ఉంచుకోవాలి'

'ఏమోనండీ, ఒకవేళ నా కేదయినా జరిగితే'...ఆమె నోరు మూశాడు రాజారావు.

* * * *

తొమ్మిదినెలల అనంతరం ఉన్నట్టుండి ఒకనాటి అరరాత్రి నొప్పులు ప్రారంభమయ్యాయి సరోజకు. సరోజతోపాటు రాజారావు కూడా చాలా బాధపడ్డాడు ఇంట్లో అందరికీ ఆందోళన ఎక్కువయింది.

వెంటనే 'నర్సింగ్ హోమ్'లో జాయిన్ చేశాడు రాజారావు. ఆమెబాధ వర్ణనాతీతం......ఆ మరునాడు మధ్యాహ్న సమయాన పండులాంటి కొడుకుని ప్రసవించింది సరోజ, కాని బాబుని చూసేందుకు సరోజ నోము ఫలించలేదు. 'సరూ'...వెర్రివాడిలా అరచాడు రాజారావు. అనంతవాయువుల్లో లీనమైన సరోజకు ఆ పిలుపు వినిపించలేదు. బాబుమాత్రం 'కేర్ కేర్'మని ఏడుస్తున్నాడు. సరోజ జ్ఞాపకార్థం ఇచ్చిన బాబుని చేతుల్లోకి తీసుకున్నాడు రాజారావు.

[అందరికీ కోర్కెలు ఉండడం సహజమే; అందులో స్త్రీ మాతృమూర్తి అవ్వాలని వాంఛించడంలో తప్పు లేదుగా! అయితే ఆ కోర్కె వేదనా భరితమైనదైతే... ఎలామరి?]

